ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): బనవాసి జవహర్ నవోదయలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 9వ తరగతి ప్రవేశానికి 1176 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 836 మంది పరీక్ష రాశారు. అలాగే 11వ తరగతికి 1199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 871 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి పరిశీలించారు.



- 1.76 లక్షల జనాభాకు ఒక్కటే..
- ఆ 16 వార్డుల్లో పెరిగిపోతున్న నేర సంస్కృతి
- విస్తరించిన కాలనీలు.. కనిపించని రక్షణ చర్యలు
- ఎప్పటి నుంచో అదనపు పోలీస్ స్టేషన్ కోసం డిమాండ్
- పట్టించుకోని పోలీసు బాస్‌లు

ఓ పోలీస్ స్టేషన్ కావాలి

నగరాన్ని ఆనుకున్న ఆ 16 వార్డుల్లోని పలు కాలనీల్లోని ప్రజలు చాలా కాలంగా ఓ పోలీస్ స్టేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఈ కాలనీలన్నీ పదిహేనేళ్ల కిందటే కర్నూలు మున్సిపాలిటీలో కలిశాయి. అప్పటి నుంచి ఆ కాలనీ శివారు ప్రాంతాల్లో జనాభా విపరీతంగా పెరిగింది. కాలనీలు విస్తరించాయి. జనాభా కూడా మూడు లక్షల పైమాటే. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్‌కు చెందిన 16 వార్డుల్లో 1.76 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇంత మంది జనాభా ఉన్న ఈ కాలనీలకు ఒక్క పోలీస్‌స్టేషన్ మాత్రమే ఉంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఇక్కడ మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. పలు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పట్టించుకుని వదిలేస్తుండటం, కాలనీల్లో సరైన పోలీసింగ్ లేకపోవడంతో నేర ప్రవృత్తి పెరుగుతోంది.

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు అర్బన్ ప్రాంతానికి చెందిన 16 వార్డులు ఉన్నాయి. వీటిలో మూడు వార్డులు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా మిగతావన్నీ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోకే వస్తున్నాయి. ఈ 16 వార్డుల్లో 60కి పైగా కాలనీలు ఉన్నాయి. ప్రధానంగా శరీన్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, కల్లూరు తదితర ప్రాంతాల్లో నేర సంస్కృతి వేగంగా విస్తరిస్తోంది. పలు హత్య కేసుల్లో నిందితులు ఈ ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారు. పాఠశాలలు, పార్కులు, పబ్లిక్ స్థలాలు హంద్రీనది వెంట విచ్చలవిడిగా పేకాట, బెట్టింగులు సాగుతుంటాయి. రాత్రయితే చాలు బీరు సీసాలు గళగళలాడుతుంటాయి. ఉదయాన్నే వచ్చే ఉపాధ్యాయులకు ఈ సమస్య తలనొప్పిగా మారింది. ఈ సమస్య ఎక్కువగా షరీన్ నగర్‌లోని పాఠశాలలో కనిపిస్తోంది. హంద్రీనది ఒడ్డు వెంట నిత్యం తాగుబోతులే కనిపిస్తుంటారు. మద్యం సేవించడానికి వెళ్లి ఒకరొకరు కొట్టుకుని ఎంతో మంది హత్యకు కూడా గురయ్యారు. మరోవైపు నగర శివారు కాలనీలు పెరుగుతున్నాయి. అందమైన కాలనీలు రూపొందుతున్నా కొంత మంది ఆకతాయిలు, రౌడీషీటర్ల వల్ల ఈ ప్రాంతానికి మాస్ ఏరియాగా పేరు పడుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మరో వైపు కర్నూలు ఆర్టీసీ బస్టాండు పెద్ద సమస్య. నిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ తరచుగా జరుగుతున్న దొంగతనాలతో పోలీసులే బెంబేలెత్తిపోతున్నారు. మరో వైపు బస్టాండు వెనుక ప్రాంతం పాత కల్లూరు ప్రాంతాల్లో ఉండే లాడ్జిల్లో నిత్యం బ్రోతలింగ్, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నిత్యం తాగుబోతులతో రద్దీగా ఉంటుంది.



ప్రధాన జంక్షన్

అటు బెంగళూరు.. ఇటు హైదరాబాదు, మరోవైపు బళ్లారి, ఆదోని ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ ఈ 16 వార్డుల్లో భాగంగానే ఉన్నాయి. దీంతో ఈ కాలనీలన్నీ నిత్యం రద్దీగా ఉంటాయి. ఓ వైపు ఆటోనగర్, కల్లూరు ఇండస్ట్రియల్ ఏరియా, పెద్ద పెద్ద హోటళ్లు, పాఠశాలలు, హాస్పిటల్స్, లోకాయుక్త కార్యాలయం ఇలా ఒకటేమిటి పెద్ద వాణిజ్య సముదాయాలే ఈ ప్రాంతంలో ఉన్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా:

అర్బన్ వార్డుల్లోని కొన్ని కాలనీలతోపాటు ఆర్టీసీ బస్టాండు, బళ్లారి చౌరస్తా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఈ ప్రాంతాల్లోని కాలనీల్లో నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయి. ఓ గజదొంగ రెండేళ్లుగా 40 ఇళ్లలో వరుసగా చోరీలు చేసినా పోలీసులు గుర్తించలేకపోవడం గమనార్హం. దీన్ని బట్టి విజిబుల్ పోలీసింగ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరో వైపు రిచ్‌మండ్ విల్లాస్‌లో, కోడుమూరు రహదారిలోని కొన్ని కాలనీల్లో నెలలో రెండు, మూడు దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రధానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటంతో నిత్యం జరిగే లావాదేవీలపై దొంగల కన్ను ఉంటుంది. కానీ ఆ ప్రాంతంలో ఒక్క పోలీసు కూడా కనిపించడు.



మిగతా 7వ పేజీలో

కర్ణాటక బ్యారేజీ కడితే జిల్లా ఎడారే

- తుంగభద్రపై ప్రాజెక్టులను అడ్డుకుంటాం
- రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం ఇది
- జిల్లా ఇంజనీర్లతో ఎలా మాట్లాడుతారు?
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై కర్ణాటక బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణాలు చేపడితే కర్నూలు జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయచూరు జిల్లాలోని చిలకలపర్వి, కౌతాళం మండలం కుంబళనూరు మధ్య బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణం చేసి దిగువకు చుక్కనీరు రాకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తుంగభద్ర జలాలు అంతర్రాష్ట్ర సమస్య కావడంతో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశమన్నారు. జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లతో కర్ణాటక మైనర్ ఇరిగేషన్ ఈఈ స్థాయి ఇంజనీర్లు చర్చించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మన ఇంజనీర్లు కూడా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడమని తేల్చి చెప్పాల్సిందిపోయి వారితో ఎలా మాట్లాడుతారని నిలదీశారు. కర్ణాటక ఏకపక్షంగా తీసుకునే నిర్ణయాలు వల్ల జిల్లాలో ఆర్డీఎస్ కుడి కాలువ, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు, సుంకేసుల బ్యారేజీకి నీటి నిల్వలు ఆగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందన్నారు. కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మించదలిచిన ప్రాజెక్టులపై కృష్ణా బోర్డు, కేంద్ర జల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

బాబాయ్ వివేకాను చంపింది ఎవరో జగనే తేల్చాలి

అమ్మకు చెల్లికి న్యాయం చేయని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడని తిక్కారెడ్డి ప్రశ్నించారు. బాబాయ్ వివేకానందారెడ్డిని హత్య చేసింది ఎవరో వైసీపీ ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి తేల్చాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు వైసీపీ హయాంలో ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు రాత్రిబహాళ్లు శ్రమిస్తున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేసిన ఆర్థిక నేరాలు, ఘోరాలను బట్టి చూస్తే జీవితాంతం జైలు జీవితం గడాల్సి వస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో పులివెందులలో గెలిచి చూపించాలని సవాలు విసిరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, డైరెక్టర్లు ముంతాజ్, నంద్యాల నాగేంద్ర, పోతురాజు రవికుమార్, జేమ్స్, బేతం క్రిష్టుడు, తిరుపాల్‌బాబు, సత్రం రామక్రిష్టుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి

మద్యం దుకాణాల కోసం 133 దరఖాస్తులు

- ప్రభుత్వానికి రూ. 2.66 కోట్ల ఆదాయం
- రేపు జిల్లా పరిషత్‌లో లాటరీ పద్ధతిన ఎంపిక
- ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కోసం 133మంది గీత కులస్థులు దరఖాస్తులు చేసుకోగా రూ. 2.66 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం, సుధీర్ బాబు తెలిపారు. శనివారం సాయంత్రం జిల్లాలోని పది ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సేకరించిన దరఖాస్తుల పరిశీలించారు. రాయలసీమ స్థాయిలో జిల్లాలోని పది మద్యం దుకాణాలకు సంబంధించి అత్యధిక దరఖాస్తులు చేసుకోగా, కర్నూలు ఎక్సైజ్ స్టేషన్‌లో 60 మంది దరఖాస్తు చేసుకోడం రాష్ట్రంలోనే 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈనెల 10న జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షతన లాటరీ పద్ధతిన దుకాణాల ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. 10 దుకాణాలకు సంబంధించి కర్నూలు 60, ఎమ్మిగనూరు 12, ఆదోని 15, కృష్ణగిరి 2, ఆదోని రూరల్ 10, కౌతాళం 8, మద్దికేర 4, కోసిగి 9, చిప్పగిరి 4, ఆస్పరి దుకాణానికి 7 దరఖాస్తుల వచ్చాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దుకాణాల కేటాయింపునకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు.



దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

మార్చిలోగా లక్ష మందికి 'ఉపాధి' పనులు: డ్వామా పీడీ

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు తదితర నియోజకవర్గాలు కరువు పరిస్థితులు ఎదుర్కొంటు న్నాయని, ఆ ప్రాంత రైతులు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నీటి యజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య తెలిపారు. శనివారం విలేకరులతో పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం 50వేల నుంచి 60వేల మందికి పనులు కల్పిస్తున్నామని, రోజు సగటు కూలీ రూ.270 నుంచి రూ.300ల దాకా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్చి నాటికి ఈ సంఖ్య లక్షకు దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పనులు చేసిన కూలీలకు దాదాపు రూ.30 కోట్ల దాకా అందించాల్సి ఉందని, త్వరలోనే డబ్బులు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఉపాధి హామీలో ఎటువంటి అక్రమాలకు చోటు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. 10వేల శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ సంఘాల ద్వారా ప్రతిరోజు పనులు చేసే కూలీల లెక్కింపు స్పష్టంగా జరుగుతుందని, బోగస్ పేర్లు నమోదయ్యే అవకాశమే ఉండదన్నారు.



పీడీ వెంకటరమణయ్య

మేయర్ పీఠంపై

టీడీపీ కన్ను..!?



కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్యకు అవిశ్వాస గండం తప్పదా..? తాజాగా రాజకీయ సమీకరణాలు పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. మరో ఏడాది పదవీ కాలం ఉన్న మేయర్ పీఠం కోసం టీడీపీ కన్నేసింది. ఎలాగైనా ఆ పీఠంపై బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ కార్పొరేటర్‌ను కూర్చొబెట్టేందుకు ఆ పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ముందుగా పాలకవర్గంలో బలం పెంచుకుంటున్నారు. ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి టీడీపీ బలం 22 సభ్యులకు చేరింది. పదవి దక్కాలంటే ఆరుగురు సభ్యుల బలం కావాలి. ఇప్పటికే పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ ముఖ్య నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తాజాగా రెండు రోజుల క్రితం టీడీపీకి టచ్‌లోకి వచ్చిన వైసీపీ కార్పొరేటర్లలో టీడీపీ కార్పొరేటర్లు ఓ రైస్ మిల్లులో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే హిందూపురం మున్సిపల్ చైర్మన్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను టీడీపీ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో కర్నూలు మేయర్ రామయ్యపై అవిశ్వాసం తప్పదంటూ నగరంలో జోరుగా చర్చ సాగుతోంది.

- ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి 22కు చేరిన బలం
- మరో ఆరుగురు వస్తే కుర్చి టీడీపీ సొంతం
- టీడీపీ నేతల టచ్‌లో పలువురు వైసీపీ కార్పొరేటర్లు
- మేయర్ రామయ్యకు పదవీ గండం తప్పదా..?

కర్నూలు న్యూసిటీ/కర్నూలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థగా 1994లో ఏర్పడింది. 1995లో జరిగిన తొలి మేయర్ ఎన్నికల్లో నాటి టీడీపీ అభ్యర్థి బంగి అనంతయ్య విజయం సాధించి మేయర్ పీఠంపై కూర్చున్నారు. 2000లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి మేయర్‌గా ఫిరోజ్‌బేగం బాధ్యతలు చేపట్టారు. 2005లో జరిగిన ఎన్నికల్లో కూడా రెండో పర్యాయం కాంగ్రెస్ విజయం సాధించి మేయర్ పదవిని ఎస్.రఘురామిరెడ్డి దక్కించుకున్నారు. ఆ తరువాత పదేళ్లు ఎన్నికలు జరగలేదు. 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. మేయర్‌గా బీవై రామయ్య బాధ్యతలు చేపట్టారు. 52 వార్డులు (డివిజన్లు) కలిగిన కర్నూలు కార్పొరేషన్‌లో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆనాటి అధికార పార్టీ వైసీపీ 43 విజయం సాధిస్తే.. టీడీపీ అభ్యర్థులు ఆరుగురు, ఆ పార్టీ మద్దతుతో ముగ్గురు కలిపి 9 మంది విజయం సాధించారు.

మిగతా 6వ పేజీలో

యువతలో బాధ్యత పెరగాలి

- సమాజానికి సాహిత్యం చాలా అవసరం
- ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి
- కర్నూలులో ప్రారంభమైన 'విరసం సాహిత్య పాఠశాల'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): యువతలో సమాజంపట్ల బాధ్యతలు పెరగాల్సిన అవసరం ఉందని, సాహిత్యం వల్లే సమాజాన్ని అర్థం చేసుకోవడంతోపాటూ సమాజాన్ని అర్థం చేసుకోగలమని దివంగత ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి అన్నారు. విరసం (విప్లవ రచయితల సంఘం) 24వ సాహిత్య పాఠశాల రెండు రోజుల కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగర శివారు గుత్తిరోడ్డు, వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మండపంలో 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ సాహిత్య పాఠశాల వేదికకు ఇటీవల దివంగతులైన ప్రొఫెసర్ సాయిబాబా ప్రాంగణంగా నామకరణం చేశారు. ఉదయం 11 గంటలకు విరసం నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధుల నడుమ అట్టహాసంగా విరసం పతాకాన్ని ఆవిష్కరించారు. అరుణోదయ కళాకారులు ఆలపించిన పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అరుణ్ ఆహ్వానంపై విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో వసంతకుమారి ప్రసంగించారు. ఆమె ప్రొఫెసర్ సాయిబాబా వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని, నిబద్ధతతో కూడిన ఆయన జీవిత సారాన్ని వివరించారు. ప్రొఫెసర్ సాయిబాబా జీవితంతో, మరణంతోనూ సమాజంలో ఒక ఉత్తేజాన్ని తీసుకొచ్చారన్నారు. ఆయన సహచర్యంలో ఆయనతో కలిసి చేసిన అనేక ప్రజా ఉద్యమాలను, పోరాటాలను ఆమె వివరించారు. ఉద్యమ జీవితంలో రాజకీయాలు, సాహిత్యం వేర్వేరు కాదని, అవి ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయని చెప్పారు. సాయిబాబా ఢిల్లీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఆయన అనేక పోరాటాలను చేశారని చెప్పారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ నేడు రాజ్యం, మతం గట్టి బంధం ఏర్పరచుకున్నాయని, ప్రగతిశీల ఉద్యమకారులు, కవులు, ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చేయాల్సిన ప్రణాళికలను చర్చించాలని సూచించారు.



మాట్లాడుతున్న వసంతకుమారి




విరసం కార్యక్రమానికి హాజరైన వివిధ ప్రాంతాల ప్రతినిధులు

మిగతా 6వ పేజీలో

తుంగభద్ర తీరం సాహిత్యం





జ్ఞాపకాల పురి విప్పిన
నెమలీకలు- నెమరు వేతలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): 'తెలుగు సాహిత్యంలో ఉన్నంతమంది గొప్ప కథా రచయితలు ఏ భారతీయ భాషల్లో లేరని, ఆ అదృష్టం తెలుగు వారికే ఉందని' ప్రముఖ రచయిత, పద్మశ్రీ కొలుకలూరి ఇనాక్ అంటారు. అలాంటి ఒక గొప్ప కథా రచయిత జిల్లాకు చెందిన జి. ఉమామహేశ్వర్. ఈ రచయితకు కథా సాహిత్యం అంటే అమితమైన ఇష్టం. ఆ ఇష్టమే తనతో అనేక కథలను చదివించింది. ఆ ఇష్టమే తనను వర్తమాన కథా రచయితల సరసన నిలబెట్టింది.

గత జీవితానుభవాలు స్మృతిపథంలో మెదిలినప్పుడు రచయితలు రాయకుండా ఉండరు. అలా ఉమామహేశ్వర్ స్మృతిపథం నుంచి పుట్టినదే 'నెమలీకలు నెమరువేతలు' కథా సంపుటి. మధురమైన ఆనాటి జ్ఞాపకాల్లోని తన బాల్యాన్ని, బాల్య స్నేహితులను లాక్కెళ్లి, చిన్నతనంలో వాళ్లు చేసిన అల్లరి చేష్టలు, కొంటె పనులు, సరదాలు, సంబరాలను నెమరువేసుకోవడానికి ఉమామహేశ్వర్ చెల్లాచెదురైన తన జ్ఞాపకాలన్నింటినీ తోడుకొని ఒకచోట కుప్పపోస్తే ఈ నెమలీకలు నెమరువేతలు కథా సంపుటిగా పాఠకుల చేతుల్లో వాలింది. ఈ కథా సంపుటి చదివితే అది కురిపించే బాల్యపు జ్ఞాపకాల జడివానలో పాఠకులు తడిసి ముద్ద కావాల్సిందే.

ఉమామహేశ్వర్ తను రాసిన తొలి కథ 'గొర్రె వచ్చింది'. ఇది 1998 జూలై 18న ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించారు. ఆయన రాసిన కథలు తమిళ, కన్నడ భాషల్లోకి అనువాదం అయ్యాయి. 2011లో 'పరాయోళ్ళు', 2018లో 'భరోసా' కథా సంపుటాలు వెలువరించారు. నెమలీకలు నెమరువేతలు ఆయన రాసిన మూడో కథా సంపుటి. నెమలీకలు నెమరువేతలులో మొత్తం 16 కథలు ఉన్నాయి. ఇందులోని ప్రతి కథ మనల్ని వేలుపట్టుకొని మన బాల్యంలోకి లాక్కెళతాయి. 'కడప టు సున్నిపెంట వయా శ్రీశైలం' ఈ కథా సంపుటిలోని మొదటి కథ. '1978 వేసవి మధ్యాహ్నం' ఇది ఈ కథలోని తొలివాక్యం. ఎత్తుగడ శిల్పంతో రచయిత తన కథల కాలాన్ని సూచించారు. రచయిత బాల్యం శ్రీశైలానికి కూతవేటు దూరంలో గల సున్నిపెంటకు చేరుకోవడం, నల్లమల కొండలలో ప్రతిధ్వనించే సుప్రభాత శ్లోకాలు, కాలుష్య ఛాయలు సోకని, నాగరికత ఆనవాళ్లు కనిపించని ఆ ప్రాంతాన్ని వర్ణించిన తీరు వల్ల కథ అద్భుతంగా ఆకట్టుకుంటుంది. ఈ సంపుటిలోని కథల వెనుక ఉన్న జ్ఞాపకాలు ఎంత మధురమైనవో, అంతే వేదనాభరితమైనవి. కొన్ని జ్ఞాపకాలు మనల్ని ముందుకు నడిపిస్తే, మరికొన్ని మనసును బాధిస్తాయి. కొన్ని జ్ఞాపకాలు అప్పుడప్పుడూ నవ్విస్తాయి. మైమరపిస్తాయి. ఈ కథలు కేవలం రచయిత జ్ఞాపకాలు మాత్రమే కాదు, అవి మనవి కూడా అనిపిస్తాయి. ఉమామహేశ్వర్ కథలు మరిచిపోయిన మన బాల్యపు జ్ఞాపకాల్లోనికి వెళ్లడానికి దారి దీపాలై నిలబడతాయి.



- డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు

నిష్ఠూరపు సమయం

సడలిన బంధాలు
అర క్షణం కూడా ఆలోచించలేని
అపార్థాల నడుమ
మళ్లీ మళ్లీ ముడిపడలేక
తడిసిన ఆకాశపు అంచుల్లా
విలపించబోయే ముందు
ఒదిగి వున్న సంద్రంలా
బడబాగ్నిని గుండెల్లో దాచుకున్నాయి.

ఆత్మాభిమానపు పెనుగులాటలో
భుజానికి తగిలించుకున్న ప్రశ్నలు
మరింత బరువెక్కితే
యాంత్రికత్వపు ముసుగులో
వర్తమానం
సమాధానానికై వెతికింది
ముళ్లకంప మీద
విసిరేయబడ్డ మనసు
బయట పడేందుకు
భ్రమను సాయం అడిగింది.

ముడులను మళ్లీ మళ్లీ సరిచేస్తున్న
మమకారం చిరాకుకు
చిరునామా అయితే
ఆత్మాభిమానం అనవసరపు
పెనుగులాటలో
అంతర్యుద్ధం చేస్తోంది
అభిమాన ఆత్మాభిమానాల మధ్య
జరుగుతున్న సంఘర్షణ
హోరెత్తిన సంద్రంలా అగుపించినా
కాళ్ల కింద ఇసుకకు మళ్లే కృంగదీస్తోంది
ఈ నిష్ఠూరపు సమయం కూడా
జీవన దశే అని సాగిపోవాలని
తెలుసుకునేందుకు అనుభవమే
చాలట్లేదు.



- కల్యాణదుర్గం స్వర్ణలత, కర్నూలు
98486 26114

నగరంలో నేడు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉదయం 10 గంటలకు నగరంలో గుత్తిరోడ్డులోని వెంకటాద్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో విరసం ఆధ్వర్యంలో రెండోరోజు కార్యక్రమాలు మొదలవుతాయి. విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, వరలక్ష్మి, పాణి, సాగర్‌ల ప్రసంగాలు, సాయంత్రం 4:30 గంటలకు బహిరంగ సభలో కె.నాగేశ్వరాచారి, జి.కల్యాణరావు, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి వంటి ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

● మధ్యాహ్నం 3 గంటలకు గోదా గోకులం క్షేత్రంలో అష్టావధానం సభ ఉంటుంది. అవధాని బులుసు అపర్ణ అవధానం చేస్తారు. ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, విశిష్ట అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాంశంకర్ నాయక్, మాంటిస్సోరి, ఇండస్ పాఠశాలల అధినేత కేఎస్‌వీ రాజశేఖర్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

● సాయంత్రం 6:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు పత్తి ఓబులయ్య, బీఎస్ రావు తెలిపారు. ప్రముఖ గాయకులతో అలనాటి ఘంటసాల పాటలతో సంగీత విభావరి నిర్వహిస్తున్నారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

అటవీ భూముల సర్వే

అన్యాక్రాంతం కాకుండా చర్యలు



తిమ్మాపురం పొలాల్లోని అటవీ భూముల్లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

మహానంది, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహానంది-బండిఆత్మకూరు మండలాల్లోని నల్లమల అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా అటవీశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శనివారం నల్లమల్ల సరిహద్దులో సర్వే ప్రారంభించారు. మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని 166,167,168,170 సర్వే నంబర్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల తహసీల్దార్ రమాదేవి, నంద్యాల డివిజన్ అటవీ రేంజ్ ఆఫీసర్ ధినేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో నంద్యాల మండల సర్వేయర్లు శివప్రసాద్, నాగరాజుతోపాటు విలేజ్ సర్వేయర్లు క్రిష్ణ, హుసేనయ్య, సద్దాం ఉసేన్, షఫీలు సర్వే నిర్వహించి ఆయా సర్వే నంబర్లలోని అటవీ సరిహద్దులను గుర్తించారు. మిగతా అటవీ పరిసరాల్లో కూడా పది రోజుల పాటు సర్వే నిర్వహించి అటవీ భూమి ఆక్రమించిన ప్రదేశాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటామని అటవీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ డీఆర్వో హైమావతి, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాణా ప్రతాప్, పరమేశ్వరి పాల్గొన్నారు.

తెలుగుభాషపై పట్టు.. పతకాలు కొట్టు

సాహిత్యం, కథలు, పుస్తక సమీక్ష పోటీల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులు



రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన గ్రామీణ విద్యార్థులు

చాగలమర్రి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుపై పట్టు సాధించి ఎక్కడ బాష పోటీలు జరిగిన పాల్గొని బహుమతులు సాధిస్తున్నారు చాగలమర్రి మండలం పెద్దబోధనం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. తెలుగు విభాగంలో సాహిత్యం, కథలు, పుస్తక సమీక్ష పోటీల్లో పాల్గొని బహుమతులు సాధిస్తూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి డి.యశ్వంత్ 2024 సెప్టెంబరులో ఉరిమల్ల ఫౌండేషన్ నిర్వహించిన జాతీయస్థాయి పుస్తక సమీక్షలో 300 మంది పాల్గొంటే వారిలో ప్రథమంగా నిలిచారు. జాతీయ స్థాయిలో జ్ఞాపిక, పతకాన్ని దక్కించుకున్నారు. పుస్తక సమీక్షలో విజేతగా నిలవడంతో తెలుగు బుక్‌ఆఫ్‌రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. యశ్వంత్ రాసిన ఐదు నీతికథలు కూడా నీతి పరిమల పుష్పాలు అనే పుస్తకంలో ప్రచురితమయ్యాయి. మాచిరాజు బాలసాహితి పీఠం, హైదరాబాదులో నిర్వహించిన కథల పోటీల్లోను ప్రథమంగా నిలిచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. అలాగే పదోతరగతి చదువుతున్న నాగపుష్ప అనే విద్యార్థి కథల పోటీల్లో సత్తా చాటుతూ విజేతగా నిలిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విద్యార్థిని ఆసక్తిని గమనించిన తెలుగు ఉపాధ్యాయురాలు నాగేశ్వరమ్మ ఎంతగానో ప్రోత్సహించారు. నాగపుష్ప తెలుగుపై మక్కువతో సాహిత్యాభిలాష పెంపొందించుకున్నారు. చిన్న చిన్న కథలు రాస్తూ పోటీలు ఎక్కడ జరిగిన పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. 2024 సెప్టెంబరులో హైదరాబాదు మాచిరాజు బాలసాహితీ పీఠం నిర్వహించిన కథల పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమంగా నిలిచారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో 232 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మందిని విజేతలుగా ప్రకటించారు. అందులో నాగపుష్ప ఒకరుగా నిలిచారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులు యశ్వంత్, నాగపుష్పలను పాఠశాల హెచ్ఎం కాత్యాయని, ఉపాధ్యాయులు అభినందించి మెమోంటోలు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. తెలుగు భాషలో పట్టు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయురాలు నాగేశ్వరమ్మకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యంతో మరిన్ని పథకాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకొని రావాలని హెచ్ఎం కోరారు.

మేయర్ పీఠంపై టీడీపీ కన్ను..!?

(5వ పేజీ తరువాయి)

వైసీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో 19వ వార్డు కార్పొరేటర్‌గా విజయం సాధించిన బీవై రామయ్య మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ మేయర్లుగా ఎస్.రేణుక, ఎస్.అరుణ బాధ్యతలు చేపట్టారు. 52 వార్డుల్లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 33, పాణ్యం నియోజకవర్గం పరిధిలో 16, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో మూడు డివిజన్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడం, నగర అభివృద్ధి కోసం వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా టీడీపీ గొడుగు నీడలో చేరడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం బలహీనమవుతూ వస్తోంది.

22 సంఖ్యకు చేరిన టీడీపీ బలం

కార్పొరేషన్ పాలకవర్గంలో 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎమ్మెల్యే మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు చేయించుకున్నారు. వీరితో కలిపితే కౌన్సిల్‌లో ఓటు హక్కు కలిగిన సభ్యుల సంఖ్య 55కు చేరింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కించుకోవాలంటే 28 మంది సభ్యుల బలం ఉండాలి. వాస్తవంగా టీడీపీకి 9 మంది కార్పొరేటర్లే ఉన్నారు. ఎన్నికల ముందు, ఆ తరువాత మరో 10 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరడంతో 19 మందికి చేరింది. వీరితో పాటు ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలతో కలిపితే టీడీపీ బలం 22కు చేరింది. 43 కార్పొరేటర్లు కలిగిన వైసీపీ ప్రస్తుతం బలం 33కు పడిపోయింది. టీడీపీ బలం పెరగడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.

అవిశ్వాసానికి రంగం సిద్ధమైందా..?

2021 మార్చి 18న మేయర్ బీవై రామయ్య ప్రమాణ స్వీకారం చేశారు. 2026 మార్చి 17 వరకు అంటే ఏడాది పదవీ కాలం ఉంది. ఎలాగైనా సరే రామయ్యను పదవి నుంచి దింపేయాలని టీడీపీ ముఖ్య నాయకులు తెర వెనుక రాజకీయ వ్యూహాలకు పదును పెట్టినట్లు సమాచారం. అధికారంలో ఉండగా మేయర్ రామయ్య తమను కనీసం కార్పొరేటర్లుగా గుర్తించి గౌరవం ఇవ్వలేదని, ఆయన ఆ పదవిలో ఉంటే చూడలేకపోతున్నామని, అవిశ్వాసం పెడితే బేషరుతుగా మద్దతు ఇస్తామని వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ నేతలకు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ నాయకులు మాత్రం రాజకీయంగా ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు ఓ రైస్ మిల్లు కేంద్రంగా అత్యవసర భేటీ కావడంతోపాటు మేయర్‌పై అవిశ్వాసంపై చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో రామయ్యను పదవి నుంచి దింపేందుకు రంగం సిద్ధమైందని చర్చ జరుగుతోంది. అయితే అవిశ్వాసానికి ముందే బీవై రామయ్య తన పదవికి రాజీనామా చేస్తారని కూడా పలువురు చర్చించుకోవడం గమనార్హం.

అవిశ్వాసం పెడితే..

మేయర్ బీవై రామయ్యకు పదవి గండం తప్పదా..? నగరంలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. 9 మంది సభ్యుల బలం కలిగిన టీడీపీ.. ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిపి 22 సభ్యులకు చేరింది. అవిశ్వాసం ద్వారా మేయర్‌ను పదవి నుంచి దింపేయాలి అంటే.. అవిశ్వాసం పెట్టిన రోజు కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యుల్లో సగం కంటే ఒకరు ఎక్కువ మెజార్టీ సాధించాలి. అప్పుడు మేయర్ అవిశ్వాసం నెగ్గి పదవి కాపాడుకున్నట్లే. సగం కంటే ఒకరు తక్కువైతే పదవి కౌన్సిల్ విశ్వాసం కోల్పోయినట్లే. మేయర్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత జరిగే మేయర్ ఎన్నికల్లో కొత్తగా మేయర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సభ్యుల సంఖ్య ప్రకారం మేయర్ రామయ్య పదవి కాపాడుకోవాలంటే 28 మంది సభ్యుల బలం కూడగట్టుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసీపీకి 33 మంది సభ్యులు ఉన్నా.. వారిలో ఆరేడుగురు టీడీపీ ముఖ్య నాయకులకు టచ్‌లో వెళ్లినట్లు తెలుస్తోంది. అవిశ్వాసం పెడితే వారంతా టీడీపీకి మద్దతు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సమాచారం. అదే జరిగితే వైసీపీ బలం 25-26కు పడిపోతుంది. మేయర్ అవిశ్వాసంలో ఓడిపోక తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

యువతలో బాధ్యత పెరగాలి

(5వ పేజీ తరువాయి)

ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం
- అల్లం రాజయ్య



దేశంలో ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిందేనని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య అన్నారు. విరసం రెండో సెషన్‌లో శివరాత్రి సుధాకర్ అధ్యక్షతన 'మేధో సృజన రంగాలపై ఫాసిస్టుల దాడి - కార్పొరేట్ ప్రయోజనాలు' అనే అంశంపై అల్లం రాజయ్య ప్రసంగిస్తూ రాజ్యం కోసం చేసే యుద్ధం నిలబడుతుందా లేదా ప్రజాసంఘాలు చెప్పాల్సిందేనని అన్నారు. అన్నిరకాల భావజాలాలు తమ మందకొడితనాన్ని వదులుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ క్రమంలో చరిత్రను అధ్యయనం చేసి ప్రజా పోరాటాలకు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.

సంఘ్ పరివార్ ఏడు ఎత్తుగడలు
-కెంగార మోహన్



మాట్లాడుతున్న కెంగార మోహన్

సంఘ్ పరివార్ ఏడు రకాల ఎత్తుడగడ్ని అవలంబిస్తోందని, దేశ చరిత్రను ఘనంగా చెప్పడం, హిందువులను వేరుగా గుర్తించి, వారిని ఒక గొడుగు కిందకి చేర్చడం, దేశం ఎదుర్కొంటున్న ఉపద్రవాలకు ముస్లిం, క్రిస్టియన్, కమ్యూనిస్టులను బాధ్యుల్ని చేయడం, హిందుత్వ విమర్శకులను దేశద్రోహులుగా ముద్రవేయడం, విద్య కాషాయీకరణ, మతాల ఆధారంగా ఆందోళనలు వంటి చేస్తోందని ఆరోపించారు. గతంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు వచ్చాయని, 2014 తర్వాత భావజాల రంగంలో సంక్షోభాలు తీవ్రమయ్యాయని అన్నారు. సభలో సైబాబా మాట్లాడుతూ దేశంలో ముస్లింలపై జరుగుతున్న దారుణ మారణకాండలపై కవులు గళమెత్తాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అరుణోదయం కళాకారులు రూపొందించిన ఆడియో సీడీని అరుణోదయ అధ్యక్షురాలు విమల, వసంతకుమారి, అరసవిల్లి కృష్ణ, అరుణోదయ కళాకారుల మధ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీక్షణం సంపాదకుడు ఎన్ వేణుగోపాల్, విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా, విరసం నాయకులు పాణి, అరుణ్, వరలక్ష్మి, శశికళ, నాగేశ్వరాచారి తదితరులు ప్రసంగించారు.

సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



టెన్నిస్ ఆడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు సాధన చేసి ఉజ్వల భవిష్యత్తును పెంపొందించుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం స్థానిక కర్నూలు క్లబ్ టెన్నిస్ గ్రౌండులో ఏర్పాటు చేసిన 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ అవకాశాలు ఉండే క్రీడలను ఎంచుకోవాలని అన్నారు. తద్వారా ఆరోగ్యం మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాఫ్ట్‌వేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, జిల్లా సంఘం కార్యదర్శి నవీన్ శావల్, పీఈటల సంఘం ప్రతినిధి కొండేపి చిన్న సుంకన్న, సుప్రీయ, గీత సంఘం ప్రతినిధులు రేవంత్, సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు గీత, సుప్రియ, రంగస్వామి పాల్గొన్నారు.

గుర్తించదగ్గ స్థాయిలో మహిళలు

సత్యవాణి



మాట్లాడుతున్న సత్యవాణి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో గుర్తించదగ్గ స్థాయికి మహిళలు ఎదుగుతున్నారని జి.భారతీయం సత్యవాణి అన్నారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ సమీపాన గల వికాస భారతి, ధార్మిక సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సురబీ గోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలోనారీశక్తి చైతన్య సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి వికాస భారతి నిర్వాహకులు నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధులుగా భారతీయం సత్యవాణితో పాటు పుల్లారెడ్డి ఇంజ నీరింగ్ కళాశాల డీన్ డా.కే.దేవకి, సమన్వయ కారిణి స్వప్న, బీవీ నాగేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో గుర్తించదగ్గ స్థాయిలో ఎదిగారన్నారు.

క్రమబద్ధీకరణకు పచ్చ జెండా


జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య




కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 2019 అక్టోబరు 15 నాటికి ఆక్రమణలో ఉన్న నివాస గృహాలను రెగ్యులరైజ్ చేయనుందని చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని అర్హులైన వారు డిసెంబరు 31 లోపు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


పంట ఉత్పత్తుల పండగ

మార్కెట్‌లో భారీగా తరలి వచ్చిన కందులు, వాము, మిర్చి





కుప్పలుగా పోసిన వాము





కందులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పండగా వాతావరణం కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులతో కళకళలాడుతోంది. జిల్లాలోని పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన రైతులతోపాటు అక్కడ పని చేస్తున్న కూలీలు, హామీలతో మార్కెట్ అంతా సందడి వాతావరణం నెలకొంది. వరుసగా కుప్పలుగా పోసిన వాము, కందులు కంటి నిండా కనిపిస్తున్నాయి. ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శమనిస్తున్నాయి. రైతులు తమ పంట ఉత్పత్తుల వద్దే కూర్చొని విక్రయాల కోసం ఎదురు చూస్తున్నారు. మంచి ధర అందితే తమ కష్టం తీరుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. ఈ తరుణంలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల చేతిలో రైతులు నష్టపోకుండా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రారంభోత్సవం అనంతరం హోలీక్రాస్ చర్చి ఎదుట క్రైస్తవులు

హోలీక్రాస్ సెంటనరీ చర్చి ప్రారంభం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్‌లో హోలీక్రాస్ సెంటనరీ చర్చి శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఇంచార్జి బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ జార్జ్ కొర్నేలియస్, తెలుగు డయాసస్‌లో ఉన్న బిషప్‌లు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి చర్చిని ప్రారంభించారు. అనంతరం వారు దైవ సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో, సమాజంలో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ద్వేష, ఈర్ష్య, అసూయలు వదిలి, ప్రేమ, క్షమాపణ, దైవ చింతనతో మెలగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర న్యాయశాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొని మాట్లాడుతూ హోలీక్రాస్ చర్చి విశ్వాసానికి ప్రతిక అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ పద్మారావు, హోలీక్రాస్ కేథడ్రిల్ గురువులు పాస్టరేట్, కమిటి సెక్రటరీ ప్రభుదాసు, ట్రెజరర్ స్టీఫెన్, విలియం ఫిలిప్, క్రైస్తవులు పాల్గొన్నారు.





ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్... చర్చిలో క్రైస్తవులు

ఓ పోలీస్ స్టేషన్ కావాలి..

(5వ పేజీ తరువాయి)

కల్లూరు అర్బన్‌లోని 16 వార్డుల్లో 3 వార్డులకు చెందిన గణేష్ నగర్, అరోరా నగర్, నంద్యాల చెక్‌పోస్టు, మారుతి మెగాసిటీ, చంద్రశేఖర్ నగర్, టెలికాంనగర్ ఇలా కొన్ని కాలనీలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వస్తాయి. అలాగే కర్నూలు నియోజకవర్గం చెందిన ప్రధాన వార్డుల్లో కొన్ని ఈ స్టేషన్ పరిధిలోకే వస్తాయి. మరో వైపు కలెక్టరేట్, కలెక్టరేట్‌లో జరిగే ధర్నాలు, కలెక్టర్ భద్రత అవసరాల కోసం ఎక్కువ భాగం పోలీసింగ్ ఇక్కడే ఉంటుంది. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రి కూడా ఉంది. దీంతో శివారు కాలనీలపై పోలీసులు దృష్టి సారించలేకపోతున్నారు. మరో వైపు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండాల్సిన సిబ్బంది కంటే తక్కువ ఉండటం.. సుమారు 50 కాలనీలు ఈ స్టేషన్ పరిధిలోకి రావడం ఆటోనగర్, బస్టాండు ప్రాంతాల్లోనే నిఘా పెట్టడంతో శివారు కాలనీల్లో పోలీసులు శ్రద్ధ చూపలేకపోతున్నారు. దీంతో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే బావుంటుందని కొద్ది కాలంగా ఇక్కడ కాలనీవాసుల ప్రధాన డిమాండ్ ఉంది. ఇటీవల ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరమే అండగా.. సమస్య పరిష్కారమే అజెండా కార్యక్రమానికి వచ్చిన వినతుల్లో తాగుబోతులు, ఆకతాయిల సమస్యలపైనే ఆ కాలనీవాసుల నుంచి వినతులు వచ్చాయి.

గతం నుంచే డిమాండ్

ఈ అర్బన్ వార్డులో మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గతంలోనే డిమాండ్ ఉంది. గతంలో పని చేసిన పోలీసు ఉన్నతాధికారులకు కూడా ఈ కాలనీల ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుసార్లు వినతులు ఇచ్చారు. 2019 సంవత్సరంలో అప్పుడు పని చేసిన ఎస్పీ ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలను గుర్తించి ఓ పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ ఓ ఏఎస్ఐ, కానిస్టేబుల్ ఉండేలా ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఈ అవుట్‌పోస్టు నామమాత్రంగానే మిగిలిపోయింది. అంతకుముందు పని చేసిన ఎస్పీలు కొన్ని పోలిస్ కమాండ్ కంట్రోల్ బాక్సులు ఏర్పాటు చేసి అక్కడకు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసేవారు. చైన్ స్నాచింగ్ జరిగిన వెంటనే అక్కడి కానిస్టేబుల్ అప్రమత్తం అయ్యేవాడు. ప్రస్తుతం ఆ కమాండ్ కంట్రోల్ కేంద్రాలు బూత్‌బంగ్లాగా మారాయి. కొన్ని కాలనీలు పోలీస్ స్టేషన్‌కు చాలా దూరంగా ఉండటంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరిగినప్పుడు పోలీసులు వెంటనే అప్రమత్తం కాలేకపోతున్నారు. నేరస్థులు ఎటు నుంచి తప్పించుకునే ప్రధాన రహదారులన్నీ కలిసి ఉండటంతో ఈ సమస్య మరింత వేధిస్తోంది.

లక్ష మంది జనాభాకు 144 మంది పోలీసులు ఉండాలి

ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో లక్ష మంది జనాబాకు 144 మంది పోలీసులు ఉండాలి. ఈ లెక్కనే త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు మూడు లక్షలు పైగానే జనాభా ఉంది. ఫోర్త్ టౌన్ పరిధిలో సుమారు 45 మంది మాత్రమే. త్రీటౌన్ పరిధిలో 40 మంది పోలీసులు మాత్రమే శాంతి భద్రతల నిర్వహణకు ఉన్నారు. మూడు లక్షల మంది జనాభాకు 420 మంది పోలీసులు ఉండాలి. ఈ రెండు పోలీస్ స్టేషన్లకు కలిసి అటూ ఇటూగా వంద లోపే శాంతిభద్రతల కోసం వంద మంది పోలీసులు మాత్రమే ఉన్నారు. ఇంకా 300 మంది పోలీసుల కొరత ఉంది.

ఏం చేయాలంటే..

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులను, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వార్డులకు ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఈ నాలుగుతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే పోలీస్‌స్టేషన్‌ను పాణ్యం నియోజకవర్గ పరిధిలో ఉండేలా చేస్తే ఒక విజిబుల్ పోలీసింగ్ ఉంటే నేరాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. అలా కాకపోయినా గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఎస్ఐ, ఎస్‌హెచ్‌వోగా ఉండే ఓ పోలీస్ స్టేషన్, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఎస్ఐ, ఎస్‌హెచ్‌వోగా ఉండే చిన్న పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి పోలీసింగ్ పెంచితే నేర సంస్కృతి తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి : గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

కల్లూరు అర్బన్ వార్డులకు చాలా ప్రాధాన్యత ఉంది. అత్యధిక జనాభా ఇక్కడే ఉంది. ప్రత్యేకంగా ఓ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. ఇటీవల డీజీపీగా పని చేసిన ద్వారక తిరుమల్‌రావుకు కూడా ఈ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై వినతి పత్రం అందించాం. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

క్షణాల్లో వెంటాడిన మృత్యువు

- పెళ్లిలో డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో యువకుడి మృతి



కొర్వి వీరేష్ (ఫైల్)

కోసిగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గుండెలు అకస్మాత్తుగా ఆగిపోతున్నాయి. నడుస్తూ.. డ్యాన్స్ చేస్తూ.. జిమ్ చేస్తూ కుప్పకూలి మృత్యుఒడికి చేరుతున్నారు. 28 ఏళ్ల యువకుడు పెళ్లి వేడుకల్లో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి కోసిగిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... కోసిగిలోని 9వ వార్డు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కొర్వి వీరేష్ (28) ఆదోని మండలం కుప్పగల్లులో బంధువుల పెళ్లి ఊరేగింపులో డ్యాన్స్ చేస్తుండగా.. గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. బంధువులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. అప్పటి వరకు పెళ్లి వేడుకల్లో సరదాగా అందరితో డ్యాన్స్ చేస్తూ పాల్గొన్న వీరేష్ కుప్పకూలిపోయి గుండెపోటుకు గురి కావటంతో పెళ్లింట విషాదచాయలు అలుముకున్నాయి. 20 నిమిషాల వ్యవధిలోనే జరగరాని నష్టం జరిగిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య సరోజ, ఆరేళ్ల కుమారుడు విజయదుర్గ, మూడేళ్ల కుమార్తె అమ్ములు ఉన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి జైలు శిక్ష

చాగలమర్రి/రుద్రవరం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్‌లో ఎర్రచందనం రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులకు తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు శనివారం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. ఆళ్లగడ్డ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన తీర్పునే తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు తిరిగి అమలు చేసిందని అన్నారు. రుద్రవరం రేంజ్‌లోని డీ వనిపెంట సెక్షన్ పెద్దవంగళి బీట్‌లో రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన గగ్గర వెంకట రమణ, ఉత్తనాల నరసింహులు, అక్కెం మద్దిలేటి, హుసేన్‌వలిలు పట్టుబడిన విషయం విదితమే. వీరికి తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టు వెయ్యి రూపాయలు, ఏడాది జైలు శిక్ష విధించింది. నిందితులను చిత్తూరు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.



చాగలమర్రి: నిందితులతో అటవీ సిబ్బంది

కోవెలకుంట్లలో ఘరానా మోసం

- దుబాయ్ నోట్లు ఇస్తామని మాయమాటలు
- నమ్మి చేరో రూ.5 లక్షలు ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు
- చెత్తకాగితాల మూట ఇచ్చి ఉడాయింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



బాధితులు శ్రీనివాసులు, మహ్మద్ బాషా

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్లలో ఘరానా మోసం చోటు చేసుకున్నది. రూ. పది లక్షల డబ్బులు ఇస్తే రూ.30లక్షలు విలువ చేసే దుబాయి కరెన్సీ ఇస్తామని మాయమాటలు చెప్పారు. ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.10 లక్షలు తీసుకొని పైన, కింద దుబాయ్ కరెన్సీ నోట్లు పెట్టి మధ్యలో చెత్తకాగితాలతో నిండిన మూట ఇచ్చి సదరు వ్యక్తి ఉడాయించాడు. బాధితులు మూట విప్పి చెత్తకాగితాలను చూసి మోసపోయామంటూ శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. బాధితులు సయ్యద్ మహబూబ్‌బాషా, డి.శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. నంద్యాల పట్టణంలోని రామాలయం వద్ద ఉన్న జ్యూస్ బండి వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి జ్యూస్ తాగి దుబాయ్ నోటు ఇచ్చాడు. ఈ నోటు చెల్లదు మామూలు నోటు ఇవ్వాలని జ్యూస్‌బండి యజమాని అడిగాడు. దీంతో తాను దుబాయ్‌లో పనిచేస్తానని, అక్కడి డబ్బులు ఇవి అని చెప్పాడు. పక్కనే ఉన్న టెంకాయలు అమ్ముకునే సయ్యద్ మహ్మద్‌బాషాకు ఆ నోటును చూపించారు. మహ్మద్‌బాషా ఆ నోటును నెట్‌లో చెక్ చేయగా అది ఒరిజినల్‌గా తేలింది. దీంతో అతడితో మాటలు కలిపి ఈ నోట్లు తన వద్ద చాలా ఉన్నాయి, మీకు కావాలంటే ఇస్తామని, రేపు రండని సదరు వ్యక్తి సయ్యద్ బాషాను నమ్మించాడు. దీంతో సయ్యద్ అతడి స్నేహితుడు శ్రీనివాసులును తీసుకొని మరుటిరోజు శుక్రవారం ఆళ్లగడ్డకు వెళ్లాడు. సదరు వ్యక్తి నెంబరుకు ఫోను చేయగా బస్టాండు వద్దనే ఉండండి వస్తామని చెప్పి కొన్ని గంటలు కాలయాపన చేయించాడు. తీరా సాయంత్రం ఓ మహిళ మహబూబ్‌బాషా నెంబరుకు ఫోన్ చేసి రూ.10 లక్షలు నోట్లు ఇస్తే రూ.30 లక్షలు విలువ చేసే దుబాయి నోట్లు ఇస్తామని నమ్మించింది. దీంతో శుక్రవారం రాత్రి నంద్యాలకు వెళ్లి శనివారం ఉదయం మహబూబ్‌బాషా రూ.5 లక్షలు, డి.శ్రీనివాసులు రూ.5 లక్షలు తీసుకొని వచ్చి మళ్లీ ఫోన్ చేశారు. సదరు వ్యక్తి తాము ఆళ్లగడ్డలో లేమని కోవెలకుంట్లలో ఉన్నామని బస్టాండు సమీపంలోని షాపు వద్దకు రావాలని తెలిపారు. మహబూబ్‌బాషా, శ్రీనివాసులు ఇద్దరూ రూ.10 లక్షలు తీసుకుని కోవెలకుంట్లకు వచ్చారు. సదరు వ్యక్తి దుబాయి నోట్లు పైన రెండు కింద రెండు పెట్టి మధ్యన చెత్తకాగితాలు పెట్టిన కట్టలను మూటలో పెట్టుకొని బైక్‌పై వచ్చి వారికి మూట ఇచ్చి వారి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు తీసుకుని ఉడయించాడు. సదరు వ్యక్తి వెళ్లిన తరువాత వీరిద్దరూ కొంత దూరం వెళ్లి ఆ మూట విప్పి చూడగా రెండు మూడు దుబాయినోట్లు తప్ప అంతా చెత్తకాగితాలు ఉండడంతో మోసపోయామని లబోదిబోమంటూ కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న చెన్నప్ప అరెస్టు

- వాహనంలో తరలిస్తుండగా నిందితుడి హల్‌చల్
- స్టీరింగ్ తిప్పి వెహికల్ బోల్తా కొట్టించే యత్నం
- హత్యాయత్నం కింద మరో కేసు నమోదు



నిందితుడు చెన్నప్పను చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వంకదారి చిన్న చెన్నప్పను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ రమేష్‌బాబు నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. స్థలం పంచాయితీ చేస్తానంటూ కొలిమిగుండ్లకు చెందిన అన్వర్ బాషా దగ్గర చిన్న చెన్నప్ప రూ.2లక్షలు తీసుకున్నాడు. పంచాయితీ తీర్చకపోగా మరో రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేదంటే ఎస్సీ ఎస్టీ కేసు పెడతానని, చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు గత నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్న చెన్నప్పపై కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే మూడు కేసులు ఉన్నాయి. కడప జిల్లా మరో కేసు ఉంది. చిన్న చెన్నప్ప పలువురు వ్యక్తులపై 20 ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాడు. ఇందులో 18 కేసులు ఫాల్స్ కేసులుగా తేలాయి. ఇలా కేసులు పెట్టి సామాన్య ప్రజలతో పాటు, ప్రభుత్వ అధికారులను బెదిరించేవాడు.



దెబ్బతిన్న పోలీసు వాహనం

పోలీసు వాహనంలో హల్‌చల్

పోలీసులు చిన్న చెన్నప్పను అరెస్టు చేసి తీసుక వెళుతున్న సమయంలో నిందితుడు హల్‌చల్ చేశాడు. పోలీసులను విడిపించుకొని స్టీరింగ్ పక్కకు తిప్పి బోల్తా కొట్టించే ప్రయత్నం చేశాడు. నిందితుడు బలవంతంగా స్టీరింగ్ తిప్పడంతో వాహనం ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో నిందితుడితోపాటు, నలుగురు పోలీసులు గాయాలయ్యాయి. హుసేని అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో వైపు పోలీసు వెహికల్‌కు భారీగా డ్యామేజ్ అయింది. దీంతో చిన్న చెన్నప్పపై మరో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నీటిని నింపుకునేందుకు పోయి ప్రమాదవశాత్తు కాలుజారి మధులక్ష్మి (42) నీటి కుంటలో పడి మృతి చెందారు. రాంపల్లెకు చెందిన చాకలి రంగన్న భార్య శనివారం వ్యవసాయ పనులకు వెళ్లి భోజనం చేయడం కోసం నీటిని తీసుకువచ్చేందుకు పొలం పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. బిందెతో నీటిని తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలోకి పడిపోయింది. కేకలు వేయడంతో పొలంలో ఉన్న హనుమక్క అనే మహిళ చీర కొంగు వేసి లాగేందుకు యత్నించినా పట్టుకోలేక లోపలికి వెళ్లిపోయి ఊపిరాడక మృతి చెందారు. గ్రామస్థులకు తెలపడంతో మృతదేహాన్ని నుంచిబయటకు తీశారు. మధులక్ష్మి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మధులక్ష్మికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

కారు బోల్తా పడి మహిళ..



దెబ్బతిన్న కారు, ఇన్‌సెట్ మహేశ్వరి(ఫైల్)

వెల్దుర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ మహిళ మృతి చెందారు. వివరాలివీ.. సత్యసాయి జిల్లా గుమ్మలకుంటకు మహేశ్వరి, ఏడాది న్నర కుమారుడు వియాన్స్‌రెడ్డి, అలాగే అమర్‌నాథ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి గుమ్మలకుంటకు కారులో పయనమ య్యారు. వీరి వెంట కదిరికి వెళ్తున్న అక్షయ్‌కుమార్ అనే వ్యక్తి కూడా ఉన్నారు. మార్గమధ్యంలో వెల్దుర్తి మండలం మంగంపల్లె స్టేజ్ దాటిన తరువాత జాతీయరహదారి-44పై కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ అవతలి రోడ్డులో పడింది. కారులో ప్రయాణిస్తున్న మహేశ్వరి(33) అక్కడికక్కడే మృతి చెందారు. అమర్‌నాథ్‌రెడ్డి, అక్షయ్ కుమార్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేశ్వరి భర్త పవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు..



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు

దేవనకొండ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మేనమామ పొలంలో ఉల్లి పంట కోయడంతో ట్రాక్టరు ద్వారా పంట తరలించే క్రమంలో ట్రాక్టరు తిరగబడి డ్రైవర్ బోదెపాడు జగదీష్ (23) మృతి చెందిన ఘటన మండలంలోని కప్పట్రాళ్లలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. వివరాలివీ.. గోనెగండ్ల మండలం బోదెపాడుకి చెందిన హనుమంతు, రంగులమ్మ దంపతుల రెండో కుమారుడు జగదీష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. కప్పట్రాళ్లకు చెందిన మేనమామ కోతి లక్ష్మన్న పొలంలో ఉల్లి పంట కోతకోసి, ట్రాక్టర్ ద్వారా లారీలోకి పంటను లోడ్ చేసేందుకు వెళ్తున్న తరుణంలో మలుపు తిరుగుతుండగా ట్రాక్టరు తిరగబడింది. ట్రాక్టర్ ఇంజన్ జగదీష్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్‌కు భార్య, ఏడాది కుమారుడు ఉన్నారు.

ఒప్పంద ఉద్యోగిపై చర్యలు

శ్రీశైలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఇంజనీరింగ్ భాగంలో ఏఈఈగా పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగి వి. రాజేశ్వరరావును విధుల నుంచి తొలగించినట్లు ఈవో ఏం. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శ్రీశైల దేవస్థానం పరిధిలో శుక్రవారం రాత్రి స్థానిక వైసీపీ నాయకుడు ఎంఏ రజాక్‌తో కలిసి ఒప్పంద ఏఈఈ వి. రాజేశ్వరరావు (రాజేష్) మద్యం తాగుతుండగా స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఈ విషయం దేవస్థానం దృష్టికి రావడంతో ఏఈఈని విధుల నుంచి తొలగించారు. దేవదాయ చట్టం 30/1987 అనుసరించి మద్యం తాగిన విషయంపై దర్యాప్తు జరిపి ఇద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి



మాట్లాడుతున్న గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి టికే జనార్దన్, మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అన్నారు. శనివారం స్థానిక సలాం ఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా ఉపాధ్యాయ శిక్షణ తరగతులు జరిగాయి. ఉద్యమ చరిత్ర, సభ నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, జీత భత్యాల ఫిక్సేషన్, సంఘం నిబంధనలు వంటి అంశాలపై చర్చించారు. ప్రజా నాట్యమండలి నాగరాజు బృందం గురువు, చదువు ప్రాముఖ్యత గురించి పాట రూపంలో వినిపించారు. సమావేశంలో ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, డి.నాగరాజు, బి.సుంకన్న, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, బీద చంద్రయాదవ్, గోవిందు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలకు నిబంధనలు సడలించాలని నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన సంఘ కార్యదర్శి రవికుమార్‌తో కలిసి మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు కల్పిస్తున్న ప్రభుత్వం ఆయా పథకాల ప్రారంభం, నమోదు తేదీలను స్పష్టంగా ప్రచారం చేయకపోవడం వల్ల అనేక మంది రుణ అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అయిందని, ఒక్క కుల ధ్రువీకరణ పత్రం పొందడానికే వారం రోజులు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కనీసం ఈ నెలాఖరు వరకు గడువును పొడిగించాలని కోరారు. అలాగే అధికారులు దరఖాస్తుదారులను గుర్తిస్తూ కుల ధ్రువీకరణ ఒక్కరోజు లోనే పొందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన సలహాదారులు పత్తి ఓబులయ్య, సింగంశెట్టి సోమశేఖర్, ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

27న అంతర్రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 27న అంతర్రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేవీ మధు, శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే సభ్యులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ10 వేలు, రూ.5వేలు నగదును అందజేస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8309165221, 83091 20684 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

2న బండలాగుడు పోటీలు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లేల రాజశేఖర్ ఆధ్వర్యంలో మార్చి 2న న్యూకేటగిరి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బజారు, తిరుపతి శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ.1000లు ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు విజేతలకు మొదటి నుంచి 8 బహుమతులు వరుసగా రూ.1.50లక్షలు, రూ.1.30 లక్షలు, రూ.1.10 లక్షలు, రూ.90వేలు, రూ.70వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.10 వేలు నగదును అందజేస్తున్న ట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 7989464141, 8309165 221 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రీనివాసులు ఎన్నికపై హర్షం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమైఖ్య అంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు ఎన్నికపై ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పనిచేసి ఏఐవైఎఫ్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. ఈనెల 8న శ్రీకాకుళంలో జరిగిన 22వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర నూతన ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు ఎన్నుకున్నారని తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి: ఏవో

సి.బెళగల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షల కోసం మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఉన్న వ్యవసాయ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానా

సి.బెళగల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుంటే జరిమానా విధిస్తామని ఎస్ఐ తిమ్మారెడ్డి ద్విచక్ర వాహనదారులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. అలాగే అనుమతి లేకుండా గ్రామాలలో ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ గౌడు, పోలీసులు ఉన్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ కోటపై కాషాయం జెండా ఎగరవేసిందని, 27 ఏళ్ల తర్వాత బీజేపీకి స్పష్టమైన మెజార్టీ వచ్చిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పర మహంస అన్నారు. స్థానిక బుధవార పేటలోని బీజేపీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పర మహంస మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలకు ఏపీ బీజేపీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. రాజ్‌విహార్ కూడలిలో నాయకులు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు రామస్వామి, ప్రేమ్ కుమార్, నాగరాజు, సాయిప్రదీప్, మాలతి, చిన్నయ్య, శ్రీరామ్ యాదవ్, ఖాన్ పాల్గొన్నారు.

కొనసాగిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ స్టేడియంలో ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు రెండోరోజూ కొనసాగాయి. కందహాల్, జేవైఎఫ్‌సీపై 7-0 గోల్స్‌తో నంద్యాల, కోడుమూరు జట్లుపై 2-0 గోల్స్, కర్నూలు బీ.క్యాంపు జట్టు కంబదహాల్‌పై 5+1 గోల్స్, జేవైఎఫ్‌సీ జట్టు, కోడుమూరు జట్టుపై 3-0 గోల్స్‌తో గెలుపొందాయని జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివా సులు తెలిపారు. విజయ కుమార్, నారాయణ, బ్రహ్మకుమార్, మహబూబ్ బాషా, జగదీష్, మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు


శంఖు, చక్రాలతో స్వామివారిని
చక్రస్నానానికి తీసుకెళ్తున్న ఆలయ నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో వెలసిన హరిహర క్షేత్రంలో శ్రీవారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు ఆలయంలోని స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు అభి షేకాలు, అర్చనలు, మహా మం గళహారతి, నైవేద్యా సమర్పణ వంటి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వసం తోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను, శంఖు, చక్రములతో స్వామివారి విగ్రహమూర్తితో సమీపంలోని తుంగభద్ర నదిలో చక్రస్నాన ఘట్టాన్ని ప్రారంభించారు. వేద పండితుడు కమలసాయినాథ శర్మ, ఆలయ అర్చకులు దేవెళ్ల విజయకుమార్ శర్మ, మామిళ్లపల్లి రాజేశ్‌శర్మ, దీపక్‌శర్మ, ప్రసన్నకుమార్ శర్మలు వందలాది భక్తులు వెంట రాగా, స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ప్రధాన కార్య దర్శి చల్లా నాగరాజ శర్మ, సముద్రాల శ్రీధర్‌లు స్వామివారి శంఖు, చక్రాలు, ఉత్సవమూర్తిని స్వహస్తాలతో తీసుకువెళ్లి నదీ స్నానం చేయించారు. అనంతరం ఆలయంలో బ్రహ్మోత్సవాల ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని నిర్వహించి, ఉత్సవాలు ముగి సినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతి నిధులు సీవీ దుర్గాప్రసాద్, శ్యామసుందర్‌రావు, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్రశర్మ పాల్గొన్నారు.


తుంగభద్రలో చక్రస్నానం అనంతరం స్వామి అమ్మవార్లను
పల్లకిలో తీసుకువస్తున్న భక్తులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

కల్లూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం మాధవీనగర్‌లోని గౌరు స్వగృహంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఓర్వకల్లు, పాణ్యం, గడివే ముల, కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంత ప్రజల నుంచి ఎమ్మెల్యే గౌరు చరిత వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలన కారణంగా పెద్దఎత్తున ప్రజలు బాధితులుగా మారారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపేలా దిశానిర్దేశం చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 58 ఫిర్యాదులు వచ్చా యన్నారు. కల్లూరు మండలం నాయకల్లు సర్వే నెంబరు 278లో గ్రామస్థులు అనుభవంలో ఉన్న 1.50 ఎకరాల భూమిలో వైసీపీ నాయకులు పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేయాలని టీడీపీ నాయకుడు వాకిటి మాదేష్ కోరారు. అదేవిధంగా కర్నూలు కార్పొరేషన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పింఛన్ల సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఎమ్మెల్యే సూచించిన పనులను ఆలస్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యతా క్రమంలో శివారుప్రాంత కాలనీల సమస్యలు పరిష్కరించేందుకు అధికా రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పెరుగు పురు షోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, కొంగనపాడు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న గౌరు చరిత

నాణ్యమైన భోజనం అందించండి: ఎంఈవో


మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీధర్‌బాబు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో శ్రీధర్‌బాబు సూచించారు. శని వారం నన్నూరు, ఓర్వకల్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయ న తనిఖీ చేశారు. విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి

గౌరు జనార్దన్‌రెడ్డి


మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న గౌరు జనార్దన్‌రెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం 32, 35 వార్డుల లో ఆయన పర్యటించారు. చింతలముని నగర్, గనిగుంతలు, ముజఫర్ నగర్‌లోని రైతుబజార్ పరిశీలించి, అనంతరం మహిళలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ తాగునీటి సరఫరా అందించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్వీ.రామకృష్ణ, ఎస్.ఫిరోజ్, పీయూ మాదన్న, రవిప్రకాష్‌రెడ్డి, టైలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి


భీష్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న
గంగపుత్ర మత్స్యకారుల సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని గంగపుత్ర భవనంలో శనివారం భీష్మా ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. జిల్లా మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, మద్దిలేటి, గోవిందు, శ్రీను రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు గోదా గోకులంలో అష్టావధానం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గోదా రంగనాథస్వామి వారి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అష్టావ ధానం సభ ఏర్పాటు చేసినట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలి పారు. అవధాని బులుసు అపర్ణ అవధానం చేస్తారని, ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగో పాల్, విశిష్ట అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాంశంకర్ నాయక్, మాంటిస్సోరి, ఇండస్ పాఠశాలల అధినేత కేఎస్వీ రాజశేఖర్ హాజరవుతారని తెలిపారు. ఈ అష్టావధానంలో విద్వాన్ మారేడు రాముడు, డాక్టర్ తొగట సురేష్‌బాబు, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, డాక్టర్ గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, మాదినేని మధుసూదన్, విద్వాన్ మునీశ్వర రావు, తోపుదుర్తి వెంకట్రామ్ పాల్గొంటారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

గూడూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాలివి.. బూడిదపాడు గ్రామానికి చెందిన బోయ సుబ్బయ్య, బోయ రామానాయుడు ఇరువురు అన్నదమ్ములు ఒకే ఇంట్లో జీవనం కొనసాగిస్తున్నారు. శనివారం ఇంట్లోని వారు పొలం పనులకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఇంటిని మంటలు చుట్టుముట్టాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన తరలివచ్చి కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అంతలోపే ఇంటి లోని పత్తి, ఇతర ధాన్యాలు, డబ్బులు, విలువైన వస్తువులు కాలి బూడిద య్యాయి. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుం బాన్ని ఆదుకోవాలని కోరినట్లు గ్రామ టీడీపీ అధ్యక్షుడు బంగారు శ్రీని వాసులు, టీడీపీ నాయకులు తెలిపారు.

సెమినార్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు


రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఏపీ పీఈటీ, ఎస్ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో రాష్ట్ర స్థాయి సెమినార్ జరిగింది. సెమినార్‌లో వ్యాయామ విద్య గురించి నిపుణులు హాజరై రాష్ట్ర స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. నాగార్జున యూనివర్సిటీ పీ సెట్ కన్వీనర్ వై. కిషోర్ (విశ్రాంత) సలహాలు అందజేశారని జిల్లా పీఈటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, చందూ నాయక్ తెలిపారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్, సీనియర్ పీడీలు శంకర్, దేవానంద్, సంజప్ప, విష్ణువర్దన్ రెడ్డి, పీడీ మౌలాలి, బుచ్చిబాబు, మనో హర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకులు

● పెచ్చులూడుతున్న వైనం

● భయాందోళనలో గ్రామస్థులు

గూడూరు/సి.బెళగల్ ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం ఆర్ కానాపురం, సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. తాగు నీటి ట్యాంకు పెచ్చులూడి పడుతుండటంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి ట్యాంకులకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్త నీటి ట్యాంకును నిర్మించాలి: సుమన్ బాబు, కానాపురం
గ్రామంలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. కొత్త తాగునీటి నిర్మించాలి. ఈవిషయాన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లాం. తాగునీటి ట్యాంకు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


గొల్లలదొడ్డి, ఆర్ కానాపురంలో శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకులు

బస్సును ఢీకొట్టి లారీ బోల్తా

సురక్షితంగా బయటపడ్డ బస్సులోని ప్రయాణికులు

కోడుమూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కోడుమూరు సమీపంలో శనివారం ఒక లారీ వెనక వైపు నుంచి ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును అదుపు చేసి నిలబెట్టారు. దీంతో బస్సులోని ప్రయాణికులు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయట పడ్డారు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తున్న బస్సును వెనక వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. రోడ్డుకు అడ్డంగా లారీ పడి పడటంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు లారీని క్రేన్ సహాయంతో రోడ్డు పక్కకు తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సి.బెళగల్ చెరువును ఎల్లెల్సీ అధికారులు శనివారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఎల్లెల్సీ డీఈ సుబ్బరాయుడు మాట్లా డుతూ సి.బెళగల్ చెరువులో పూడిక, కంపచెట్లను తొలగించాలని గ్రామస్థులు గత కొన్నేళ్లు పాలకులకు, అధికారులకు మొరపె ట్టుకుంటున్నారు. చెరువు మరమ్మతుల నిమిత్తం అంచనా నివేదికలను పంపాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో కోడుమూరు ఎల్లెల్సీ డీఈ సుబ్బరాయుడు చెరువును శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఏఈ సూర్యప్రకాశ్, లస్కర్లు, గ్రామ పెద్దలు మద్దయ్యస్వామి, మాజీ సర్పంచ్ చిన్నమునెప్ప ఉన్నారు.

హిందీ పండిట్ లేక అవస్థలు

పట్టించుకోని అధికారులు



లొద్దిపల్లె హైస్కూల్ ఇదే

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలల పునఃప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు హిందీ ఉపాధ్యాయుడు లేరు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 247 మంది విద్యార్థులు ఉండగా.. 45 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. అయితే.. ఈ తరగతులకు హిందీ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో పది పరీక్షలు ఎలా రాస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై గ్రామస్థులు డీఈవోకు వినతి పత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి హిందీ ఉపాధ్యా యుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పచ్చదనం కరువు

నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో
పార్కు నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం


ఎండిపోయిన మొక్కలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పచ్చదనం కరువైంది. కార్యాలయం ముందు భాగంలో చిన్న పార్కులాంటిది ఏర్పాటు చేశారు. అందులో కొన్ని మొక్కలు వేసి దానిని పర్యవేక్షిస్తున్నారు. గత కొత కాలంగా వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో మొక్కలు, గడ్డికి నీరు పోయకపో వడంతో అవి పూర్తిగా వాడిపోతున్నాయి. ప్రతిరోజు అధికారులు, సిబ్బంది ఇదే పార్కును చూస్తున్న కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. పార్కులకు సంబంధించి వివిధ కాలనీల్లో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు. కేవలం పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడం.. మొక్కలు నాటడం... డివైడర్లలో ఉండే మొక్కలు నీరు పోయడం వంటివి చూడటానికి ప్రత్యేకంగా హార్టికల్చర్ ఏడీ, ఇంజనీరింగ్ విభాగం డీఈఈ, ఏఈఈ ఉన్నారు. అయితే వీరంతా ఏమిచేస్తున్నట్లో అర్థం కావడం లేదని కార్యాలయానికి వచ్చే ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో నగర శివారులో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న అధికారులకు కార్యాలయం ముందు ఉండేది కనబడలేదా అని ప్రశ్నిస్తున్నారు.

చిలకలడోనలో గడ్డివాము దగ్ధం

మంత్రాలయం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో శనివారం గడ్డివాము దగ్ధమైంది. మాజీ ఎంపీటీసీ డీపీ గోవిందమ్మ, రాఘవేంద్ర గ్రామ శివారులో మూగ జీవాల కోసం పశుగ్రాసం కొనుగోలు చేసి నిల్వ చేశారు. శనివారం గడ్డివాము నుంచి మంటలు రావడంతో గమనించిన గ్రామస్థులు ఎమ్మిగనూరు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు నీటిట్యాంకర్లు, జేసీబీ యంత్రంతో, బిందెలతో మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పశుగ్రాసమంతా కాలి బూడిదైంది. ఎమ్మిగనూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశా రు. సుమారు. రూ.1.5 లక్షల నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహార చెల్లించి ఆదుకోవాలని కోరారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఈక్రాప్ నమోదుకు 15 వరకు గడువు

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు ఈక్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని ఏవో రవి తెలిపారు. శనివారం మాట్లాడుతూ పంటలను నమోదు చేసుకోకపోతే దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయదని, పంట నష్టపరిహారం అందాలన్నా ఈక్రాప్ తప్పని సరి అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : కోట్ల


రమణారెడ్డిని పరామర్శిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

దేవనకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో కార్యకర్తలకు అండగా ఉంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవనకొండ క్రాస్ రోడ్డులో కుమారుడిని కోల్పోయిన గుడిమిరాళ్ల రమణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మండలం నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీ కోసం కష్టపడాలని సూచించారు. టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, బడిగింజల రంగన్న, సుభాన్, జనార్ధనరెడ్డి, రామారావు నాయుడు, మలకన్న, వీరేష్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి'

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదిగల జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాలన్న, పట్టణ నాయకుడు గుమ్మాల బాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ మైదానంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఎస్సీలో మాదిగలకు 11 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరేష్ జగన్ మనికంట గణేష్ దత్తు మధు విజయకుమార్ పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యమూ ముఖ్యమే



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని ప్రభుత్వ వైద్యాధికారి రాగిని, విద్యాసాయి విద్యాసంస్థల చైర్మన్ యజ్ఞం వెంకట మాధవ్ అన్నారు. శనివారం విద్యాసాయి కళాశాలలో కాలేజీడే నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదివి పరీక్షలను రాయాలన్నారు. ప్రిన్సిపాల్ బాల సునీత, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు చేతివృత్తిదారుల సమావేశం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా చేతివృత్తిదారుల సమావేశం ఆదివారం పత్తికొండలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కారన్న శనివారం తెలిపారు. స్థానిక చదువుల రామయ్య భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా నాయకుడు రామాంజనేయులు హాజరవుతున్నారన్నారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. శనివారం చెన్నంపల్లిలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో గుక్కెడు సిమెంటు కూడా వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రహదారులు మురుగు కాలువలను నిర్మించిందన్నారు. బత్తిన లోక్‌నాథ్, మాబాషా ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. శనివారం బురుజుల గ్రామానికి చెందిన పులికొండ అనే వ్యక్తికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. చికిత్స చేసుకున్న రోగాలు ఆరోగ్యశ్రీలో లేకపోతే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా న్యాయం చేస్తున్నామన్నారు. బురుజుల మోహన్, కొత్తూరు శ్రీనివాసులు, రంగస్వామి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి


భీష్ముని చిత్రపటానికి పూజలు

ఆదోని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగాభవాని ఆలయంలో భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి నిర్వహించారు. భీష్ముని చిత్రపటానికి పూజలు చేశారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, బేల్దారు శ్రీనివాసులు, ఆటో వెంకటేష్, మేఘనాథ్, దుల్లయ్య, కృష్ణమూర్తి, రైచూర్ నగేష్, తెలుగు నరేష్, టైలర్ నారాయణ, చిన్న హరివాణం నాగరాజు, సాకరే సరోజ పాల్గొన్నారు.

లేబర్ ఆఫీసు ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో లేబర్ ఆఫీసును ఏర్పాటు చేయాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఈశ్వర్ రెడ్డి భవన్‌లో కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో కూలీలు, భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నారని గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో నరసన్న, పక్కృద్దీన్, రామకృష్ణ, నాగేషు, కృష్ణవేణి లలితమ్మ పాల్గొన్నారు.

వేసవి రాకముందే..

● మదనంతపురం గ్రామంలో నాలుగు రోజులకోసారి తాగునీరు


నీరు పట్టుకుంటున్న మహిళలు

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో నాలుగు రోజులకోసారి తాగునీరు వదులుతున్నారు. దీంతో గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. వేసవి రాకముందే ఇలా అయితే ఇక ఎండాకాలంలో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

పనిచేయని తాగునీటి పథకాలు

గ్రామంలో 1,500మంది నివసిస్తుండగా, మూడు తాగునీటి పథకాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ తాగునీటి పథకాలు పైపులైన్లు పగిలిపోవడంతో అవి పనిచేయడం లేదు. స్థానికంగా ఉండే తోటలోని తాగునీటి పథకం మాత్రమే పనిచేస్తోంది. కరెంటు వచ్చినప్పుడు మాత్రమే ఇక్కడ నీరు పట్టుకోవాల్సి రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎస్టీ కాలనీలో..

అలాగే గ్రామంలోని ఎస్టీ కాలనీలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని మహిళలు వాపోతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకులు పని చేయకపోవడంతో తాగునీరు అందడం లేదు. పైపులైన్ పగిలిపోవడంతోనే నీరు రావడం లేదని అధికారులు మరమ్మతులు చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

బోరు నీరే శరణ్యం..

తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతో బోరు నీరే తాగాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బోర్లలో ఫ్లోరైడ్ నీరు వస్తోందని ఆ నీరు తాగి ఇబ్బందులకు గురవుతున్నా మని ఆవేదన చెందుతున్నారు. గుక్కెడు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి


గ్రామంలో నాలుగు రోజులకోసారి తాగునీరు వదలడంతో ఇబ్బంది పడుతున్నాం, అధికారులు సమస్యను పరిష్కరించాలి. తోటలో కరెంటే ఉంటేనే నీరు వస్తోంది.
- సుంకమ్మ, మదనంతపురం

పైపులైన్లు పగిలిపోయాయి



గ్రామంలో తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్లు పగిలిపోయాయి. మరమ్మతులు చేయించాలని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.
- పరమేశ్వరప్ప, ఈవో

బీజేపీ గెలుపు హర్షణీయం

తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ గెలుపు హర్షణీయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణస్వామి నాయుడు, అన్నారు. శనివారం ఎద్దుల దొడ్డిలో పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అగ్రి ల్యాబ్ రైతులకు ఉపయోగపడేలా చూడాలి

ఆలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రికల్చర్ ల్యాబ్ రైతులకు ఉపయోగపడేలా చూడాలని సీపీఐ కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో నిర్మించిన ల్యాబ్ ఎవలు రైతులకు సేవలు అందిచకుంటే ఏం ప్రయోజనమని ప్రశించారు. ఉన్నతాధికారులు స్పందించి, గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని టీడీపీ నాయకుడు దేవేంద్ర అన్నారు. శనివారం మదనంతపురం గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంబించారు. క్రీడలు ఆరోగ్యాన్ని ఇవ్వడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తాయన్నారు. అనంరతం గెలిచిన జట్టుకు రూ.5,116ల నగదు అందజేశారు. యు.రమేష్, సుధాకర్, ఎ.రమేష్, నాగేంద్ర, భగత్ ఉన్నారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

● ప్రభుత్వాసుపత్రిలో పరికరాలు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు


నవజాత శిశువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వాసుపత్రి 1950లో నిర్మించారు. ప్రారంభమై 75 ఏళ్లయినా ఇంతవరకు సిజేరియన్ కాన్పు చేసేందుకు పరికరాలు లేవు. వైద్యుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శ్యాంబాబు పరికరాలను తెప్పించి శనివారం ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. మండగిరి అగ్రహారం గ్రామానికి చెం దిన పద్మకు వైద్యులు మొదటి సిజేరియన్ చేయగా, మగ పిల్లవాడు జన్మించాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తన తండ్రి, ఎమ్మెల్యే కేఈ క్రిష్ణమూర్తి ఓపీ బ్లాక్‌ను మంజూరు చేయించి, ఆధునీకరణ పనులను చేయించారన్నారు. వైసీపీ హయాంలో పనులు నిలిచిపో యి, వైద్యపరికరాలు నిరుపయోగంగా మారాయి. వైద్యులు తన దృష్టికి తేవడంతో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు కృషి చేశానని, వంద పడకలకు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా మన్నారు.

పాలకవర్గ ప్రమాణ స్వీకారం..

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే శ్యాం బాబు, సభ్యులుగా వైద్యాధికారి, టీడీపీ నాయకులు సాంబ శివారెడ్డి, న్యాయవాది సురేష్ కుమార్, బత్తిని లోకనాథ్ ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ ఉపాధ్యక్షుడు గోవర్ధన్, వైద్యులు, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం


ఘన జీవామృతం తయారు చేస్తున్న మహిళా రైతులు

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరమని రిసోర్స్ పర్సన్లు బి.జనార్దన్, మునిరాజు అన్నారు. శనివారం నర్సాపురం గ్రామంలో పొదుపు మహిళలతో సామూహికంగా ఘన జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఎకరాకు 400 కేజీల ఘణ జీవామృతం తయారుచేసుకోవలని, ఔజీవామృతం ఉపయో గిస్తే భూమి సారవంతమవుతుందన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసుకుని బెట్టను అధిగమించి మంచి దిగుబడులు అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ హుసేన్, ఐసీ ఆర్పీలు లక్ష్మీదేవి, బాలకృష్ణ, రామచంద్రుడు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బీజేపీ విజయంపై సంబరాలు

● ఆదోనిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ర్యాలీ


ఆదోనిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత బీజేపీ విజయం సాధించడంతో ఆదోనిలో ఆ పార్టీ నాయకులు విజయోత్సవాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి భీమాస్ కూడలి, శ్రీనివాస్ భవన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2047 నాటికి దేశం నెంబర్ వన్‌గా మారుతుందని, భారతదేశంలో 75 శాతం ప్రజలు బీజేపీ వైపు ఉన్నారన్నారు. ఢిల్లీ ప్రజలు ఆప్‌ను చీపురుతో ఊడ్చేశారన్నారు. విట్టా రమేష్, ఉపేంద్ర, నాగరాజు గౌడ్, సాయి, మల్లిక అవ్వ పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ విస్తరణకు ఉద్యమం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య


మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణకు ఐక్య ఉద్యమాలు చేపడదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. శనివారం శాంతి పాఠశాల ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షత వహించారు. రాయలసీమ వరప్రసాదాయని హంద్రీనీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల జనా భాకు తాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు సక్రమంగా పూర్తి కాకపోవడంతో ఆయకట్టు సాగులోకి రాలేదన్నారు. పందికోన రిజర్వాయర్ ఆయకట్టు స్థిరీకరణ పూర్తి చేస్తే వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తిరుపాలు, వైసీపీ నాయకుడు సోమశేఖర్, సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివారుపై శీతకన్ను..

● సాయినగర్ కాలనీవాసుల దుస్థితి ● రోడ్లు, కాలువలు లేవు ● దూరంగా విద్యుత్ లైన్లు ● కర్రలతో తీగెలు ఏర్పాటు చేసుకున్న ప్రజలు


కర్రల సాయంతో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసుకున్న కాలనీ వాసులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివారు కాలనీలను అధికారులు పట్టించుకోవడం లేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రైల్వేలైన్ వెనుక భాగంలోని సాయి కాలనీలో 150 గృహాలు ఉండగా, 400 మందికి పైగా నివసిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వమే గతంలో ఇందిరమ్మ గృహాలను నిర్మించింది. కొన్ని ఇళ్లు ఖాలీగా ఉన్నాయి.

రోడ్లు, కాలువలు లేవు..

తమ కాలనీని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సీసీ రోడ్లు, కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని అలాగే మురుగు ఇళ్ల ముందే ఉండటంతో దుర్వాసన, దోమలతో అల్లాడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రిళ్లు భయం భయంగా గడుపుతున్నారు.

దూరంగా విద్యుత్ లైన్

కాలనీకి విద్యుత్ లైన్ దూరంగా ఉండటంతో తామే కర్రలు ఏర్పాటు చేసుకుని సర్వీసు వైరును లాక్కున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే అంతే. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గాలి, వాన వస్తే సర్వీసు వైర్లు కిందపడే ప్రమాదం ఉంది.

స్తంభాలు ఏర్పాటు చేసి తీగలను మరిచారు..

కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా కాంట్రాక్టర్ విద్యుత్ తీగలు లాగలేదు. విద్యుత్ అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. దీంతో తాము ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు అంటున్నారు.

కాలనీలో సౌకర్యాలు కల్పించాలి


మా కాలనీలో సౌకర్యాలు కల్పించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించు కోవడం లేదు. సమస్యలతో సతమతమవు తున్నాను. ఇళ్ల ముందే మురుగునీరు, రోడ్ల, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం. కాలనీని అభివృద్ధి చేయాలి. - ఈరమ్మ, కాలనీవాసి

కర్రల సాయంతో విద్యుత్ ఏర్పాటు చేసుకున్నాం


మాకాలనీ శివారుగా ఉండడంతో అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాలు వేశారు. వాటికి విద్యుత్ తీగలు లాగలేదు. దీంతో చీకట్లో ఉండలేక ఇంటి కనెక్షన్ కోసం కట్టెలు పాతు కొని తీసుకున్నాము. తీగలు వేలాడుతూ ప్రమాదాలు జరిగేలా ఉన్నాయి. - రాధిక, కాలనీవాసి

గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హొళగుంద, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హెబ్బటం గ్రామంలో తమ గడ్డివామి దగ్ధమైందని బాధితులు డ్రైవర్ చిన్న ఈరన్న, ఇన్వీ వెంకటేష్ వాపోయారు. బాధితులు తెలిపిన మేరకు.. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ప్రమాదశాత్తు నిపపంటుకుని దట్టమైన పొగలు వచ్చాయి. మంటలను ఆర్పేందుకు యత్నించినా అదుపులోకి రాలేదు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేశాయి. రూ.50వేల నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు.

దాతలు సహకారం అందించాలి

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయ స్థల సేకరణకు దాతల సహకారమందించాలని ఈవో వీరయ్య, దాత పారా విశ్వనాథ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి, మాజీ చైర్మన్ దస్తగిరిగౌడ్ అన్నారు. శనివారం ఆయంలో తూర్పు రాజగోపురం ముందు ఉన్న స్థలాన్ని కొనుగోలు చేశారు. దాతలను అభినంచి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి రూ.1లక్ష విరాళం ఇచ్చారు. అర్చకుడు రంగస్వామి, సిబ్బంది ఉన్నారు.

న్యాయం చేయాలి


వీరభద్రగౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న సుశీల

ఆలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌కు మాజీ చౌకీదార్ బూర్ల సుశీల విన్నవించారు. మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో తాను 8 ఏళ్లుగా విధులు నిర్వహించానని భర్త కూడా లేదని కూతుళ్లు ఉన్నారని తెలిపారు. ఉద్యోగం నుంచి తొలగించడంతో తాను ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన వీరభద్ర గౌడ్ కలెక్టర్, డీఈవో, దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● తుగ్గలి ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్



తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని మండల విద్యాధికారి రమా వెంకటేశ్‌గౌడ్ అన్నారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, విద్యార్థుల సంఖ్య ఎంత?

జవాబు: మొత్తం 66 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 6,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. 539 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు.

ప్రశ్న: ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఎలాంటి ప్రణాళిక రూపొందించారు?

జవాబు: సెలవు దినాల్లో కూడా పదో తరగతి విద్యార్థు లకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: వలస కుటుంబాల విద్యార్థులకు ఏర్పాట్లు చేశారా?

జవాబు: విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాం

ప్రశ్న: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఎలా ఉంది?

జవాబు: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇస్తున్నాం. సమస్య లుంటే పరిష్కరిస్తున్నాము.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు: ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉన్నవారితోనే సర్దుబాటు చేసి విద్య అందిస్తున్నాం. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే మరొక ఉపాధ్యాయున్ని ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా?

జవాబు: తాగునీరు, బాత్‌రూమ్‌లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాము. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నాము.

సుజీంద్ర మార్గ్ కారిడార్ ప్రారంభానికి సిద్ధం


రంగులు వేసిన సుజీంద్ర మార్గ్

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సుజీంద్ర మార్గ్ కారిడార్ ప్రారంభానికి సిద్ధమైంది. సుజీంద్ర కారిడార్ పనులు ఆరు నెలలుగా చురుగ్గా సాగుతున్నాయి. మార్చిలో జరగనున్న రాఘవేంద్రస్వామి గురుభక్తి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించేందుకు మఠం అధికారులు సన్నహాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ క్యాంటీన్ నుంచి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం వరకు గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల మీదుగా గుమ్మాలు, రాఘవేంద్రస్వామి భక్తి, విశిష్టతను సంప్రదాయ భారత సంస్కృతిని తెలిపే విధంగా గుమ్మాలు, ద్వారాలను ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన శిల్ప కళాకారులు అందంగా తీర్చిదిద్దారు. కారిడార్‌ను 15 రోజుల్లో ప్రారంభించనున్నట్లు మఠం మేనేజర్-సీ, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ తెలిపారు.

సీసీ రోడ్ల కోసం ఆందోళన


టిప్పర్ల దగ్గర ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, కబరస్తాన్ కొట్టాల ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేవని కాలనీ వాసులు ఆందోళన చేశారు. ఎంబీ చర్చి నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు సీసీ రోడ్డు వేసి వదిలేశారు. నిత్యం ఈ దారిగుండా వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అయితే రోడ్డు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు రోడ్డుపై నుంచి వచ్చే దుమ్ము, దూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి ఈ ప్రాంతంలో రోడ్డు బాగోలేదని వేరే రూట్‌లో వెళ్లాలని భారీ వాహనాలను వెళ్లనీవ్వకుండా కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఆర్‌సీఎం చర్చి నుండి కబరస్తాన్ కొట్టాల వరకు సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు సాలే బసప్ప స్వామి రథోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన సాలే బసప్ప స్వామి ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రెండు రోజుల నుంచి సాలే బసప్ప స్వామి నందికోల సేవ, అన్నసంతర్పణ, తుంగభద్ర నది జలాలతో అభిషేకాలు, నిర్మల విసర్జనం, పంచామృతాభిషేకాలు వంటి పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి కర్నాటకలోని బిచ్చాలమఠం పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి రథంపై శివపార్వతులు, నంది, శివలింగం చిత్రపటాలను ఏర్పాటు చేసి రాయచూరు రోడ్డు వరకు ఊరేగించనున్నారు. ఈ రథోత్సవాలను తిలకించేందుకు ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

ఘనంగా రంగస్వామి జాతర


స్వామివారి రథాన్ని లాగుతున్న గ్రామస్థులు, భక్తులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవిబెట్ట గ్రామంలో రంగస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుండి స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, మహామంగళహారతి నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సంధ్యావేళలో బలరాముడు ఇంటి నుండి కుంభాన్ని రథోత్సవం దగ్గరకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వందలాది మంది భక్తుల మధ్య స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సబ్జెక్టు కన్వర్షన్ ఇవ్వాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్‌ల ముందు నచ్చిన తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు సబ్జెక్ట్ కన్వర్షన్ తీసుకోవడానికి అవకాశం కల్పించాలని ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు పూజారి లక్ష్మయ్య, ఆనంద్‌రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు మాట్లాడుతూ గతంలో 2023కంటే ముందు ఇచ్చిన ప్రమోషన్‌లలో అర్హత గల స్కూల్ అసిస్టెంట్లలకు సబ్జెక్ట్ కన్వర్షన్ ఇచ్చారు. ఇప్పు డు కూడా ఆదే విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. గతంలో బలవంతంగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం లను స్కూల్ అసిస్టెంట్‌గా కన్వర్షన్ ఇచ్చారు. వారికి కూడా తిరిగి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ ఎంలుగా వచ్చే వారికి అవకాశం కల్పించాలని, అలాగే ప్రతి ఆదర్శ పాఠశాలకు పీఎస్ హెచ్‌ఎంను కేటాయించాలని వారు కోరారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


పది విద్యార్థుల స్టడీఅవర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో-2 శోభారాణి

కోసిగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో 2 శోభారాణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కోసిగిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో, కందుకూరు, సాతనూరు, దుద్ది, బెళగల్, పల్లెపాడు, వందగల్లు, జంపాపురం పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా స్టడీ అవర్స్ ఏర్పాటు మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల స్టడీ అవర్స్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతల దారులు

● మరమ్మతులకు నోచుకోని వైనం
● ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎద్దుల మార్కెట్, మార్కెట్ యార్డు నుంచి వడ్డికీరప్ప వంక వరకు రోడ్డు అస్తవ్యవస్తంగా తయారైంది. మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని పట్టణ


గుంతలు పడ్డ 11వ వార్డు ప్రధాన రహదారి


సోమప్పనగర్ ప్రధాన రహదారిలో గుంతల్లో నిలిచిన నీరు

వాసులు ఆరోపిస్తున్నారు. ఎద్దుల మార్కెట్ నుంచి షైనార్టీ కాలనీ వరకు ఏళ్లు గడుస్తున్నా మట్టి రోడ్డుగానే ఉండిపోయింది. మార్కెట్ యార్డు నుంచి వడ్డికీరప్ప వంక రోడ్డు దాదాపు ఒక కిలో మీటరు వరకు గుంతలుగా పడ్డాయి. ఈ రహదారి వలన పల్లెల నుంచి నిత్యం కూరగాయల మార్కెట్‌కు, మార్కెట్ యార్డుకు సరుకు రవాణా దిగుమతి అవుతుంది.ఈ రహదారిలో ప్రయాణం నరకయాతనగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పట్టణ రోడ్లను బాగు చేయాలని పట్టణ ప్రజ లు కోరుతున్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది.రెండో శనివారంసెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహాలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల నిజ బృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏకాదశి కావడంతో శ్రీమఠంలో అన్నదానం లేకపోవడంతో హోటళ్ల భక్తులతో కిక్కిరిశాయి.


శ్రీమఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

భక్తులకు రాఘువేంద్రుడి నిజ బృందావన దర్శనం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. శనివారం ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి, మహ మంగళహారతులు ఇచ్చారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసాన్ని పాటించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు


మంత్రాలయంలో సినీ దర్శకుడు నాగేశ్వరరెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య కుటుంబ సమేతంగా శనివారంరాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా ప్రముఖ సినీదర్శకుడు నాగేశ్వరరెడ్డి మంత్రాలయానికి వచ్చారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు శ్రీపతి ఆచార్, సురేష్ కోణాపూర్, ఐవీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం శ్రీమఠం చుట్టూ ప్రదిక్షణలు చేశారు. శనివారం రాత్రి మంత్రాలయంలోనే బసచేశారు. ఆదివారం స్వామివారిని దర్శించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందనున్నారు. వీరి వెంట తహసీల్దారు ఎస్ రవి, జయరామిరెడ్డి, వీఎర్‌ఓలు భీమన్న గౌడు, భీముడు,అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, నరసింహ దేశాయ్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి,రాఘవేంద్ర కులకర్ణి ఉన్నారు.

ఘనంగా మాఘమాస పూజలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో మాఘమాసం శనివారం సందర్భంగా నీలకంఠేశ్వర స్వామి దేవాలంలో స్వామి వారికి శివ మాల దీక్ష స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగిపోయింది. గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గ్రామాల్లో కూడా శివ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని నీలకంఠేశ్వరదేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు టౌన్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవ నగర్‌లో అంజనేయ స్వామి దేవాలయంలో చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శనివారం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడికి అభిషేకం చేసి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం హోమాలు చేసి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు అంతే కాకుండా సాయిబాబా, గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ఠించారు. కమిటీ సభ్యులు ఉశేనప్ప, ప్రతాప్, లక్ష్మన్న, కళ్యాణ్, బజారి, నాగరాజు పాల్గొన్నారు.

బాధితకుటుంబానికి ఆర్థిక సాయం

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమాన్ దొడ్డి తాండ గ్రామానికి చెందిన వైసీపీ గ్రామ నాయకుడు సుగాలి బొజ్జయ్య అనే వ్యక్తి 3వ తేదీన మృతి చెందగా ఆ కుటుంబాన్ని శనివారం వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మంచాల సొసైటీ మాజీ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయ అందజేశారు. రాంపురం రెడ్డి సోదరులు బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకులు సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, సత్యరెడ్డి, హనుమంతరెడ్డి, హనుమంతునాయక్, పాండునాయక్, వీరేష్ పాల్గొన్నారు.

సర్వం కోల్పోయాం.. సాయం చేయండి



కాలిపోయిన గుడిసె, ఆవేదన వ్యక్తం చేస్తున్న నాగరాజు కుటుంబం

కోసిగి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం కావడంతో సర్వం కోల్పోయి తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు కౌతాలం నాగరాజు, పార్వతి దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం కావడంతో ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం తిండిగింజలు, బట్టలు కాలిపోయాయి. వాల్మీకి నగర్‌కు చెందిన శివమాలధరించిన శివస్వాములు తిండిగింజలు, ఇంటి సామానుతో పాటు తోచిన ఆర్థికసాయం అందజేశారు. దాతలు, ప్రభుత్వం అధికారులు తమను ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు

కుటుంబానికి అండగా ఉంటాం


మృతదేహనికి నివాళులర్పిస్తున్న రఘునాథ్ రెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేశ్వరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కురువ చలపతి తల్లి లింగమ్మ (68) శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. మట్టి ఖర్చులకు నగదును అందజేశారు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా మాధవరం రామిరెడ్డి కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామలింగప్ప,అయ్యప్ప, భీరప్ప, నరసింహులు, మల్లయ్య, అబ్బిలి భీరప్ప, లక్ష్మన్న, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గోనెగండ్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో గత రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయడం, అందులోని చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌండర్ వీధుల్లో, మురికి కాలుల్లో చల్లడం దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని, గ్రామంలో ఏదైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్ కోరారు.

ఈక్రాప్ నమోదుకు 15 వరకు గడువు

మద్దికెర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు ఈక్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని ఏవో రవి తెలిపారు. శనివారం మాట్లాడుతూ పంట నష్టపరిహారం అందాలన్నా ఈక్రాప్ తప్పనిసరి అన్నారు.

చదువుల రామయ్య కాలనీలో సమస్యల తిష్ఠ

గోనెగండ్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): చదువులరామయ్య కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. 35 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పాటైంది. అయితే అప్పటి నుంచి నేటి వరకు మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు లేవు. టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న పల్లెపండుగ కార్యక్రమంలోనైనా కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సీసీరోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయండి



గత 35 ఏళ్లుగా మా కాలనీని ఏ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. సీసీరోడ్డు, డ్రైనేజీలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలోనైనా మా కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేపడితే బాగుంటుంది.

- చెన్నలరాయుడు, చదవులరామయ్య కాలనీ, గోనెగండ్ల


సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేని చదువులరామయ్య కాలనీ వీధి

దేశంలో తిరుగులేని బీజేపీ


కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తిరుగులేని పార్టీగా బీజేపీ నిలిచిందని బీజేపీ మండల అధ్యక్షుడు పెండేకల్ రాముడు అన్నారు. శనివారం దేశరాజధాని ఢిల్లీ పీఠాన్ని 27 ఏళ్ల తర్వాత సొంతంగా బీజేపీ అధికారంలోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. దేశ రాజధానిలో కమలం విజయకేతనం ఎగురవేసిన సందర్భంగా కోసిగి బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తమ్మారెడ్డి, కడిదొడ్డి ఈరమ్మ, కురువమారెన్న, ఆర్లబండ హుశేనీ, అయ్యన్న, వీరారెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

చిలకలడోనలో గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంత్రాలయం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో శనివారం గడ్డివాము దగ్ధమైంది. మాజీ ఎంపీటీసీ డీవీ గోవిందమ్మ, రాఘవేంద్ర గ్రామ శివారులో మూగ జీవాల కోసం పశుగ్రాసం కొనుగోలు చేసి నిల్వ చేశారు. శనివారం గడ్డివాము నుంచి మంటలు రావడంతో గమనించిన గ్రామస్థులు ఎమ్మిగనూరు అగ్నిమా పక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు నీటి ట్యాంకర్లు, ఎక్స్‌కవేటర్, బిందెలతో మంటలను ఆర్పే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పశుగ్రాసమంతా కాలి బూడిదైంది. ఎమ్మిగనూరు అగ్ని మాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. సుమారు. రూ.1.5 లక్షల నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

తుగ్గలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. శనివారం చెన్నంపల్లిలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో గుక్కెడు సిమెంటు కూడా వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెల్లలోనే రహదారులు మురుగు కాలువలను నిర్మించిందన్నారు.

కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

● వాల్మీకుల ఎస్టీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా చూడాలి
● రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న


మాట్లాడుతున్న బి.లక్ష్మన్న

మంత్రాలయం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ కులస్థుల తలరాతలు మార్చే ఎస్టీ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకోవాలని ఐక్య వాల్మీకుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న కోరారు. శనివారం మంత్రాలయంలో వాల్మీకి, బోయ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న లక్ష్మన్న మాట్లాడుతూ 40 ఏళ్లుగా వాల్మీకుల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం చేశామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వాల్మీకి బోయల స్థితి గతులు తెలుసని, వీరు కేంద్రంలోని పీఎం నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పాసు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో గ్రామ, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేసి వాల్మీకులను చైతన్యపరుస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గాపురం చిన్న ఈరన్న, నాయకులు వెంకటేశులు, మణికంత, గోపాల్, లంకారెడ్డి, మారెన్న, తిమ్మప్ప, శివరాములు, హనుమంతు, జయన్న, శేషాద్రి, మునెప్ప, మహదేవ్, శేఖర్, హనుమేష్, వన్నూరి, బీవీ రవిచంద్ర, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ విస్తరణకు ఉద్యమం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణకు ఐక్య ఉద్యమాలు చేపడదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. శనివారం శాంతి పాఠశాల ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షత వహించారు. రాయలసీమ వరప్రసా దాయని హంద్రీనీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల జనాభాకు తాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు సక్రమంగా పూర్తి కాకపోవడంతో ఆయకట్టు సాగులోకి రాలేదన్నారు. పందికోన రిజర్వాయర్ ఆయకట్టు స్థిరీకరణ పూర్తి చేస్తే వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తిరుపాలు, వైసీపీ నాయకుడు సోమశేఖర్, సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.